క్లుప్తంగా

అభివృద్ధి పనులకు ఆమోదం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో శనివారం చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. పట్టణంలోని పలు అభివృద్ధి పనులపై చర్చించి ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ కమిషనర్ జి.రఘు, మున్సిపల్ డీఈ టి.నవీన్ కుమార్, మున్సిపల్ మేనేజర్ వి.సత్యనారాయణ, టీపీఎస్ ప్రభాకర్, ఏఈ రాము, జె.సాహితి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ జనసమితి ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న భద్రునాయక్

ఇల్లెందు: తెలంగాణ జనసమితి ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుగులోత్ భద్రునాయక్ పార్టీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాన్సింగ్, బిచ్చు నాయక్, రామ్మూర్తి, రాంబాబు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

సుజాతనగర్: గుండెపోటుకు గురైన వారికి అందించే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసస్కిటేషన్)పై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైన్ డిపార్టుమెంట్ ఉద్యోగులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ జాన్సీరాం మాట్లాడుతూ.. గుండెపోటు మరణాలను తగ్గించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గుండెపోటుకు గురైన వారికి వెంటనే సీపీఆర్ విధానాన్ని ప్రయోగిస్తే ప్రాణాలతో బయటపడే అవకాశం ఉంటుందన్నారు. సీపీఆర్ విధానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉంటేనే మరణాలను నియంత్రించడం సాధ్యమవుతుందని ప్రభుత్వం గ్రహించినట్లు చెప్పారు. అందువలనే ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిండడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమేష్, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాలకు సేవ చేయడం అదృష్టం



మాట్లాడుతున్న డాక్టర్ జాన్సీరాం

సుజాతనగర్: పశువైద్యం గొప్ప వృత్తి అని, మూగ జీవాలకు సేవ చేయడం అదృష్టమని పశువైద్యాధికారి నాగులు అన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పశువైద్యశాలలో శనివారం కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంతువుల ఆరోగ్యం, సంరక్షణ, పశువైద్య సేవలు గుర్తించేలా ప్రతి సంవత్సరం ఏప్రిల్ చివరి శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవంగా పాటించడం జరుగుతుందన్నారు. పశువులు, ఇతర జీవాల నుంచి సంక్రమించే సుమారు 200 రకాల వ్యాధులను నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వాహనదారులూ.. జాగ్రత్త

- దూరప్రయాణాలైతే మరింత భద్రం
- భగ్గుమంటున్న ఎండలతో వాహనాలకు ప్రమాదం
- గాలి, పెట్రోల్ విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి



కలెక్టరేట్ బయట చెట్ల నీడన పార్కింగ్ చేసిన వాహనాలు

కొత్తగూడెంటౌన్: ఎండాకాలం ఎండలు దంచి కొడుతున్నాయి. భానుడి ప్రభావం మనుషులపైనే కాక వాహనాలపైనా పడుతోంది. ఎండాకాలంలో రోడ్లు వేడెక్కుతుండగా.. తారురోడ్లు మరింత సెగలు కక్కుతున్నాయి. ఈ నేపథ్యాన వాహనాలను ఎండలో ఉంచితే టైర్లు వేడెక్కి పేలే ప్రమాదం ఉంది. అలాగే, పెట్రోల్, డీజిల్ లీక్ కావడం.. చిన్న నిప్పురవ్వ తాకినా పెను ప్రమాదం వాటిల్లే అవకాశముంది. ఈ మేరకు వేసవిలో వాహనదారులు జాగ్రత్తగా ఉండాని వాహనరంగ నిపుణులు, మెకానిక్‌లు సూచిస్తున్నారు.

ప్రణాళికతో పనులు...

పనులు ఏవైనా సరే ఉదయం, సాయంత్రం వేళల్లో చేసుకోవడమే మేలు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ప్రయాణం చేయడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉద్యోగం, బాధ్యతలు, వృత్తిని బట్టి కాలంతో సంబంధం లేకుండా కొందరు పనులు చేస్తూనే ఉండాలి. వాహనాలకు కూడా నిత్యం పని చెప్పాల్సిందే. వానాకాలం, చలికాలం ఎలా ఉన్నా ఎండాకాలంలో మాత్రం వాహనదారులు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలి.

ఏకకాలంలో దూరం వద్దు..

వాహనదారులు ఎండలకు బయటకు వచ్చినప్పుడు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. వేడికి పెట్రోల్, డీజిల్ లీకై మండే అవకాశం ఉందని చెబుతున్నారు నిపుణులు. ఈ విషయాన్ని గమనించి వాహనాల్లో ఫుల్ ట్యాంకు పెట్రోల్, డీజిల్ కొట్టించకపోవడమే మేలని సూచిస్తున్నారు. అలాగే, సాధ్యమైనంత వరకు నీడలోనే పార్కింగ్ చేయాలి.

ఈ జాగ్రత్తలు పాటించాలి...

- ఎండాకాలం కావడంతో వాహనదారులు తమ వాహనాల్లో పెట్రోల్, డీజిల్‌లను ఫూల్ ట్యాంక్‌ను చేయించకుండా ఉండాలి.
- ఎండకు పెట్రోల్, డీజిల్ ఆవిరి కావడమే కాక లీకై మంటలు వ్యాపించే అవకాశం ఉంది.
- ద్విచక్ర వాహనాదారులు ట్యాంకుకు క్లాత్ కవర్ వాడితే మంచిది.
- వాహనాలను ఎండలో ఉంచకూడదు.
- వాహనాలను ఎండలో ఒక గంట ఉంచితే ఆ ట్యాంకులోని 40 నుంచి 80 మిల్లీలీటర్ల ఇంధనం ఆవిరవుతుందని అంచనా.
- అలాగే, ఎండలో గంటల తరబడి వాహనాలను ఉంచితే వాహనాలకు ఉన్న రంగు త్వరగా వెలిసి పోతుంది.
- ఈ రంగు మళ్లీ వేయించాలంటే రూ.5 వేల నుంచి 10 వేలకు పైగా ఖర్చు.
- టైర్లలో గాలిని ఎప్పటికప్పుడు చూసుకోవాలి.
- ఎల్‌పీజీ వాహనాలు ఉపయోగించే వారు వేసవిలో వాటికి దూరంగా ఉండాలి.
- ఎండాకాలం పూర్తయ్యేవరకు కొత్త టైర్లు వాడాలి. సెకంట్ హ్యాండ్ టైర్లు వాడకూడదు.
- వాహనాల్లో ఏసీ నిరంతరాయంగా వాడితే షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉంది.
- గ్యాస్ కిట్లు ప్రభుత్వ అప్రూవల్ ఉన్నవే ఉపయోగించాలి. నాసిరకానివి వాహనాల్లో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

ఫుల్ ఇంధనం, గాలి వద్దు..

ఏ వాహనమైనా సరే పూర్తిస్థాయిలో ఇంధనం నింపించకపోవడమే మేలు. తద్వారా ఎలాంటి ప్రమాదం జరగకుండా వాహనాలతో పాటు మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఇక టైర్లలో గాలి పరిమితికి మించి గాలిని కొట్టించొద్దు. గాలి ఎక్కువగా ఉంటే టైరులో వేడి పెరిగి.. బయటి వేడి తోడై పేలిపోయే అవకాశం ఉంది. ఎండాకాలంలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తే గంట గంటకు వాహనం ఆపి ఇంజన్ చల్లబడే వరకు ఉంచాలి.

అత్యవసర సమాయాల్లో సంప్రదించాల్సిన అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు

కేంద్రం	కార్యాలయం	అధికారి
కొత్తగూడెం	08744242701	8712699297
ఇల్లందు	08745252099	8712699295



ఎండలకు నిర్మానుష్యంగా కొత్తగూడెం - ఖమ్మం ప్రధాన రహదారి

ఈవీలతో జాగ్రత్త..

ప్రస్తుతం ఎలక్ట్రిక్ బైకులు, కార్లు వినియోగం పెరుగుతోంది. అయితే, వేసవిలో ఈవీల యజమానులు చాలా జాగ్రత్తలు పాటించాలి. చాలామంది సాధారణ వాహనాల మాదిరిగానే వీటిని వినియోగిస్తుంటారు. కానీ చార్జింగ్ పెట్టేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. బ్యాటరీ వేడిగా ఉన్నప్పుడు చార్జింగ్ పెట్టకూడదు. ఆయా వాహనాలకు చార్జింగ్ పెట్టి రాత్రుళ్లు వదిలివేయకూడదు. నిరంతరాయంగా చార్జింగ్ వల్ల వేడి పెరిగి అగ్నిప్రమాదాలకు అవకాశం ఉంటుంది.

జాగ్రత్తలు పాటించాలి



ఎండాకాలంలో వాహనదారులు వాహనాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. సాధ్యమైనంత మేరకు నీడలోనే పార్కింగ్ చేయాలి. అలాగే, పెట్రోల్, డీజిల్ ఫుల్‌ట్యాంక్ కొట్టించకూడదు. దూరప్రయాణం వెళ్లేవారు కాస్త గాలి తక్కువగానే ఉండేలా చూసుకోవాలి. రీ బటన్ టైర్లను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించ వద్దు.

– పి.వేణు జిల్లా రవాణాశాఖ అధికారి

అందరి దేవుడు ఒక్కడే..



మాట్లాడుతున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): అందరి దేవుడు ఒక్కడేనని, అందరూ కలిసి మెలసి జీవిస్తేనే ఆనందం అని జామాతే ఇస్లామి హింద్ సభ్యులు అబ్దుల్ బాసిత్, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ అన్నారు. శనివారం చుంచుపల్లి మండలం రుద్రంపూర్, కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని రామవరంలలో జామాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈద్‌మిలాప్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. రంజాన్ ఉపవాసాలు మనిషిని సకల చెడుకు దూరంగా ఉంటూ మంచి పనులు చేస్తూ మానవతా విలువలు కలిగిన మహోన్నతుడిగా మారేలా శిక్షణ ఇస్తాయన్నారు. తద్వారా దైవభీతి, ఆదార సత్ సమాజాన్ని గావించి యావత్ మానవాళి సుఖసంతోషాలతో ప్రేమ అనురాగాలతో కలిసి మెలసి ఉండేలా ప్రేరణ కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో కవి తూముల శ్రీను, బజరంగ్ గిర్ధారిలాల్, మొక్కల రాజశేఖర్, సమీమ్, రబ్బానీ, అక్బర్, రసూల్, జకీర్, నజీర్, ముస్తాఫా, కూరగాయల శ్రీను, మహిళా అధ్యక్షురాలు ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ స్వలాభానికే ట్రస్ట్ ఏర్పాటు



మాట్లాడుతున్న రాజేష్ నాయక్

సుజాతనగర్: రాజకీయ స్వలాభం కోసం ట్రస్ట్ ఏర్పాటు చేసిన రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు మోసపూరిత మాటలను నమ్మొద్దని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ రాజేష్ నాయక్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో కోమటిపల్లి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రస్ట్ ఏర్పాటు వెనక రాజకీయ స్వలాభమే తప్ప నియోజకవర్గ ప్రజలపై ప్రేమ కాదన్నారు. మతపరమైన సమావేశాలు ఏర్పాటు చేస్తూ, ఓట్ల కోసం చేస్తున్న ప్రయత్నాలను నియోజకవర్గ ప్రజలు గమనించాలన్నారు. కరోనా సమయంలో కోట్లాది రూపాయలను వెనకేసుకొని ట్రస్ట్ ఏర్పాటు చేశారని ఆరోపించారు. రాజకీయ దురుద్దేశాన్ని ప్రజలు గమనించి తగిన విధంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎల్‌హెచ్‌పీఎస్ వైరా ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, నాయకులు రాందాస్ నాయక్, రాములు, రత్య, శంకర్ పాల్గొన్నారు.

భిక్షాటన చేసి వీఓఏల నిరసన



టేకులపల్లిలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోరం కనకయ్య



పాల్వంచరూరల్: భిక్షాటన చేస్తున్న వీఓఏలు

పాల్వంచరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 13వ రోజు శనివారం పాల్వంచలో వీఓఏలు భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి కె.సత్య మాట్లాడారు. గ్రామసంఘం ఓబీలు లక్ష్మీ స్వరూప, పిచ్చమ్మ, ఎం.రమాదేవి, జి.నాగమణి, కె.రాములమ్మ, ఎస్.రజనీ పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో దొడ్డ రవికుమార్, వీఓఏల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, రమాదేవి, ఉమ, కృష్ణవేణి, సుజాత, జయ, కల్పన, మహేశ్వరి, రోజా, కుమారి, నర్సింహారావు, సోములు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ మేరకు శనివారం సమ్మె 13వ రోజుకు చేరింది. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తదితరులు సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అధైర్యపడొద్దని అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు చంద్రకళ, కార్యదర్శి మూడ్ చరణ్, గౌసియా, జయ, నాగమణి, స్వప్న, కావేరి, శిరోమణి, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ బాలాజీ నాయక్, గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాంకుడోత్ హత్తీరాం తదితరులు వీఓఏల సమ్మెకు మద్దతు తెలిపారు.

ఇల్లెందురూరల్: తమ విధులను క్రమబద్ధీకరించాలని, మెరుగైన వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన సమ్మె శనివారం 13వ రోజుకు చేరుకుంది. నిరసన దీక్ష శిబిరం నుంచి ప్రదర్శన చేపట్టిన వీఓఏలు పట్టణంలో భిక్షాటన చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం వద్ద కొద్దిసేపు ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ అప్పారావు, ఎంపీపీ చీమల నాగరత్నమ్మలకు అందజేశారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, అధికారుల వద్ద భిక్షాటన చేశారు. కార్యక్రమంలో నబీ, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, ఖాదర్, శంకర్, రాము, సుల్తానా, వెంకటేశ్వర్లు, మరియ, బస్, రాందాస్, లక్ష్మి, విజయ, రజియా తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం



సమస్యలపై మాట్లాడుతున్న ఎంపీటీసీ బిచ్చా

ఇల్లెందురూరల్: అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదాల నడుమ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యక్షతన శనివారం వాడీవేడిగా సాగింది. గ్రామపంచాయతీలలో అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా ఎంపీటీసీలను చిన్నచూపు చూస్తున్నారని కొమరారం ఎంపీటీసీ బిచ్చా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కొమరారం పీహెచ్‌సీ వైద్యులను ప్రశ్నిస్తున్న క్రమంలో వైస్‌ఎంపీపీ దాస్యం ప్రమోద్ కలుగచేసుకోవడాన్ని ఎంపీటీసీ బిచ్చా తప్పుపట్టారు. గ్రామాలలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, బెల్ట్‌షాపులకు నేరుగా మద్యం ఆటోలలో రవాణా చేస్తూ ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని పలువురు సభ్యులు ఆరోపించారు. మద్యం రవాణాను నిలువరించడంతోపాటు బెల్టు షాపులు లేకుండా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. సుభాష్‌నగర్ సర్పంచ్ వల్లాల మంగమ్మ మాట్లాడుతూ.. తాము గతంలోనే బెల్ట్ షాపులను బంద్ చేయించాలని వినతిపత్రం ఇచ్చామని, అయినా స్పందన లేదని ఆరోపించారు. అటవీశాఖ మండలస్థాయి అధికారి గైర్హాజరై డీఆర్‌ఓలు, తహసీల్దార్ కృష్ణవేణి స్థానంలో డిప్యూటీ తహసిల్దార్ హాజరుకావడం పట్ల ఎంపీటీసీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలారం సర్పంచ్ సరోజిని విజ్ఞప్తి మేరకు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థలాన్ని అటవీశాఖ చూపాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా మంజూరైన నిధులతో సీసీ రోడ్లను కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయడం సరైంది కాదని బోయితండా సర్పంచ్ బానోత్ సంతు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ పెద్దలు తమకు ఇష్టమైన ప్రాంతాలకు నిధులు కేటాయించడం వల్ల ఏజెన్సీ గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయని వాపోయారు. సమావేశంలో ఎంపీడీఓ అప్పారావు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు

కొత్తగూడెంటౌన్: మేదరబస్తీ విరాట్‌నగర్‌లోని శ్రీభవానీ శంకర సహిత, శ్రీగోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం జరగనున్న శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 330వ ఆరాధన మహోత్సవాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం ఆరాధన మహోత్సవం, వాసవి జయంతి సందర్భంగా హోమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు శ్రమజీవుల చిహ్నం విగ్రహావిష్కరణ

జూలూరుపాడు: 137వ మే డే సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శ్రమజీవుల చిహ్నం విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. విగ్రహావిష్కరణకు ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సిలువేరి నరసింహారావు, పూరేటి సత్యనారాయణ, గుడిమెట్ల సీతయ్య, బలుగూరి నరసింహారావు, పోగుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జడ్జి శ్యాంశ్రీ

కొత్తగూడెంటౌన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్‌లోని లీగల్ ఎయిడ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్యాంశ్రీ అన్నారు. శనివారం జిల్లా కోర్టులో మానిటరింగ్ కమిటీ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, సీనియర్ న్యాయవాది జీవీకే మనోహర్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ..

ప్రతినెల ట్రాన్స్‌జెండర్‌లకు, సెక్స్ వర్కర్లకు ఉచితంగా బియ్యం సరఫరా చేయనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. శనివారం జిల్లా కోర్టులో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి సమీపంలోని సెక్యూర్ ఎన్జీఓ ఆఫీస్‌లో ట్రాన్స్‌జెండర్స్, సెక్స్ వర్కర్‌లకు ఉచితంగా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

‘దళితబంధు’ దళారుల పేర్లు బయట పెట్టాలి



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: దళితబంధులో కమీషన్లు తీసుకున్న ఎమ్మెల్యేల పేర్లు బయట పెట్టాలని, వారిని బర్తరఫ్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పార్టీ శ్రేణులతో కలిసి పోస్టాఫీస్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని, ప్లకార్డులు పట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. కామేష్ మాట్లాడుతూ.. దళితబంధులో ఎమ్మెల్యేలు రూ.3 లక్షలు లంచం తీసుకుంటున్నారని సీఎం చెబుతున్నారని వారికి మనసెలా వచ్చిందని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు రాబంధుల్లా తయ్యారయ్యారని విమర్శించారు. దళితబంధులో జరిగిన అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ఎమ్మెల్యేలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయి, నాగుల రవికుమార్, సిద్దంకి మల్లేష్, కత్తి బాలకృష్ణ, వంగా రవిశంకర్ పాల్గొన్నారు.

మే డే ఉత్సవాలు ఘనంగా జరుపుకుందాం..



ఇల్లెందురూరల్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

చికాగో అమరుల స్ఫూర్తితో కార్మిక చట్టాలను రక్షించుకుందామని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. మే డే వేడుకలను ఘనంగా నిర్వహించాలని శనివారం పలు కార్మికవాడలు, ఓపెన్‌కాస్టులో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో మే డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించి తమ వ్యతిరేకతను చాటి చెప్పాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



సింగరేణి(కొత్తగూడెం): వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న సాబీర్‌పాషా



టేకులపల్లి: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఇల్లెందు: మాట్లాడుతున్న సారయ్య

వంటావార్పుతో జేపీఎస్‌ల నిరసన



సహపంక్తి భోజనాలు చేస్తున్న జేపీఎస్‌లు

చుంచుపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెలో భాగంగా రెండో రోజు శనివారం వంటవార్పు కార్యక్రమాన్ని చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ సముదాయాల బయట ప్రత్యేక శిబిరం వద్ద మహిళా జేపీఎస్‌లు ప్రత్యేకంగా వంటలు చేసి వడ్డించి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మె శిబిరంలో పలువురు జేపీఎస్‌లు మాట్లాడుతూ.. సమస్య తీవ్రరూపం దాల్చకముందే రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల విషయంలో సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి అమల్లోకి తెచ్చిన పల్లె ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి గ్రామాలను ప్రగతిబాట పట్టించడంలో తాము కీలక పాత్ర పోషించామని చెప్పారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు అందుబాటులో లేని సమయంలో దాదాపు రెండేళ్లపాటు ఉపాధి పనులను విజయవంతంగా పర్యవేక్షించామని గుర్తుచేశారు. కరోనా సమయంలో ఆరోగ్య సిబ్బంది కంటే ప్రాణాలకు తెగించి మరీ ప్రజలను కాపాడడంలో తమ పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. సమ్మె ఉధృత రూపం దాల్చక ముందే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమ్మెకు టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, పలువురు యూనియన్ నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు.

పల్లెల్లో పలు సేవలకు అంతరాయం...

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు దిగిన నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో పాలన కుంటుపడే అవకాశం ఉంది. ఇప్పటి వరకు గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడంలో జేపీఎస్‌లే కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రధానంగా నిత్యం పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణ కొరవడి అస్తవ్యస్తంగా మారే అవకాశం ఉంది. ప్రభుత్వం ఇటీవల జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు యాసంగి కొనుగోలు కేంద్రాల వద్ద బాధ్యతలను అప్పగించింది. వీరు ప్రస్తుతం అందుబాటులో లేనందున కొనుగోళ్లపై ప్రభావం పడనుంది. జూలైలో హరిత హారం కార్యక్రమం కోసం నర్సరీల్లో మొక్క ల పెంపకంపై దృష్టి సారించే వారే లేరు. ఇవే కాకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులు, జనన, మరణ ధ్రువ పత్రాల జారీ, ఉపాధి హామీ వంటి పనులకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా 377 మందికి జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు సమ్మెలో ఉన్నందున ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో పాలనపై పర్యవేక్షణ కొరవడే వీలుంది.